www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 5 జనవరి 2025
5
ఏలూరు

జిల్లా పరిషత్‌లో ఆఫీస్ సబార్డినేట్లకు ఉద్యోగోన్నతులు

ఏలూరు సిటీ:జిల్లా పరిషత్‌లో ఆఫీస్ సబార్డినేట్లకు ఉద్యోగోన్నతుల ఉత్తర్వులను జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ప్రతి కేడర్‌లోనూ ఖాళీలు ఏర్పడిన వెనువెంటనే ఉద్యోగోన్నతులు అర్హత కలిగిన సిబ్బందికి కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 46 మందికి వివిధ కేడర్లలో ఉద్యోగోన్నతులు కల్పించడం తనకు సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రతి ఉద్యోగి తాను పని చేసే సంస్థ కోసం పాటు పడాలని సంస్థ గౌరవాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మోహన్‌రావు, నటరాజు, రవికిషోర్ పాల్గొన్నారు.

ఉత్తర్వులను అందిస్తున్న పద్మశ్రీ

బిల్లుల్లో 'ఎఫ్‌పిపిసిఎ'
ఛార్జీల మోత..!

హడలెత్తిస్తున్న విద్యుత్ బిల్లులు
జనవరి నెల బిల్లుల్లో మరో ఎఫ్‌పిపిసిఎ భారం
ఒకేసారి మూడు అదనపు భారాలతో జనం బెంబేలు
వినియోగించిన విద్యుత్‌కు.. బిల్లుకు మధ్య భారీ తేడా
దిక్కుతోచని స్థితిలో విద్యుత్ వినియోగదారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యుత్ ఛార్జీల భారం మోయలేక జనం అల్లాడిపోతున్నారు. గత ప్రభుత్వం తప్పిదమంటూ కూటమి సర్కార్ తప్పించుకునే పనిలో పడగా, ఈ భారమంతా కూటమి ప్రభుత్వానిదేనంటూ వైసిపి తీవ్ర విమర్శలు చేసుకుంటూ జనాల నెత్తిన భారాలు మోపి ఇరుపార్టీలు వికటాట్టహాసం చేస్తున్న పరిస్థితి నెలకొంది. వాడుకున్న విద్యుత్‌కు.. వస్తున్న కరెంటు బిల్లులకు ఏమాత్రమూ సంబంధం లేకుండా జనాలు లబోదిబోమంటున్న పరిస్థితి ఏర్పడింది. రూ.687 కరెంటు బిల్లులో అదనపు ఛార్జీల భారం రూ.313 ఉన్న పరిస్థితి నెలకొంది. బిల్లులో సగం వరకూ అదనపు ఛార్జీల భారాన్ని జనం నెత్తిన రుద్దిన దుస్థితి కొనసాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 12 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతులు విద్యుత్ కనెక్షన్లు సామాన్య ప్రజానీకానికి సంబంధించినవే. డిసెంబర్ కరెంటు బిల్లులతోనే జనం తీవ్ర ఆందోళన చెందగా జనవరి నెల బిల్లులు మరింత షాక్ కొడుతున్న పరిస్థితి నెలకొంది. డిసెంబర్ నెలలో ఎఫ్‌పిపిసిఎ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేస్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్) ఛార్జీలు రెండు ఉండగా, జనవరిలో నెలలో ఎఫ్‌పిపిసిఎ భారాలు మూడుకు చేరాయి. దీంతో బిల్లులు మోతమోగుతున్న పరిస్థితి నెలకొంది. 2022-23,2023-24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ పంపిణీలో అదనపు ఖర్చుల పేరుతో జనాలపై విద్యుత్ బిల్లుల బాదుడు తారాస్థాయికి చేరింది. విద్యుత్ బిల్లులో సగం అదనపు ఛార్జీల భారమే ఉంటుంది. గత వైసిపి పాలనలో ఏడుసార్లు అదనపు ఛార్జీల భారం వడ్డించగా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరునెల్లోనూ రెండు అదనపు ఛార్జీల భారం మోపింది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ వరుస విద్యుత్ ఛార్జీల వడ్డన సాగిస్తోంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. చలి విపరీతంగా ఉండడంతో ఫ్యాన్ కూడా వేసుకోలేని పరిస్థితి ఉంది. ఇక ఎసిల ఊసే లేకుండా పోయింది. కానీ కరెంటు బిల్లులు మాత్రం ఏమాత్రమూ తగ్గలేదు. ఎఫ్‌పిపిసిఎ భారాలే ఇందుకు ప్రధాన కారణం.



జనవరి 3వతేదీన తీసిన బిల్లులో మూడు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు



గడిచిన డిసెంబర్ 3వ తేదీన తీసిన బిల్లులో రెండు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు

సంక్షేమం ముసుగు.. భారాల బాదుడు

ప్రజలకు పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం మరోపక్క భారాలను మాత్రం విపరీతంగా మోపుతోంది. గడిచిన ఆరు నెలల్లోనే రెండు ఎఫ్‌పిపిసిఎ విద్యుత్ భారాలను జనాలపై మోపింది. వంట నూనె నుంచి పప్పుల నుంచి ఇతర నిత్యావసర వస్తువుల ధరలన్నీ ఆకాశాన్నంటాయి. గతంలో నెలవారీ నిత్యావసర ఖర్చులకు రూ.రెండు వేలు అయితే ఇప్పుడు రూ.ఐదు వేలు అవుతోంది. అదుపులేని ధరలతో జనం ఇబ్బందులు పడుతుండగా కరెంటు ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం మరింత దారుణంగా హింసిస్తోంది. కరెంటు బిల్లులో ఫిక్స్‌డ్, కస్టమర్, ఈడి, సర్‌ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల మోత మోగిపోతోంది. జనవరి మూడో తేదీ నుంచి కరెంటు బిల్లులు తీయడం ఆరంభమైంది. బిల్లులు చూసి జనం షాక్ తింటున్నారు. ఏలూరు టుటౌన్‌లో ఒక ఇంటికి వాడిన విద్యుత్‌కు రూ.473 బిల్లురాగా ఎఫ్‌పిపిసిఎ భారం రూ.214 ఉంది. డిసెంబర్ నెలలో ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ 2 భారాలు మాత్రమే ఉండగా జనవరిలో తీస్తున్న బిల్లుల్లో ఎఫ్‌పిపిసిఎ3 భారం కలిపింది. దీంతో బిల్లులు మోతమోగిపోతున్నాయి. విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం జనాలను పీల్చిపిప్పి చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో ఇస్తున్నట్లే ఇచ్చి.. ఇతర రూపాల్లో గుంజుకుంటుందన్న చర్చ ప్రజల్లో నెలకొంది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఇక నుంచి అదనపు ఛార్జీల భారాన్ని ఏ నెలకు ఆ నెలలో వసూలు చేయాలన్న ఆలోచన సైతం విద్యుత్‌శాఖ, ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్

విద్యార్థుల్లో సృజనాత్మకతకు..
వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం
జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను దెందులూరు మండలం కొవ్వలి జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రారంభించారు. ముందుగా జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సైన్స్ పరిశోధనల పట్ల విద్యార్థులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తాయన్నారు. రేపటి పౌరుల్ని ప్రతిభగల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వరదలు, రోడ్డు, అగ్నిప్రమాదాలు, ఏదైనా ప్రమాదాలు జరిగితే టెక్నాలజీ ద్వారా నివారించడం, రోడ్లు శాశ్వతంగా మరమ్మతులకు గురికాకుండా, చెత్తను పర్యావరణహితంగా నిర్మూలించడం, వంటి అనేక సామాజిక అంశాలపై చిన్నతనంలోనే పరిశోధనలు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఇటువంటి కార్యక్రమంలో తాను పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోని పాఠశాల విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక అంశాల్లో ఉత్తమమైన 81 ప్రదర్శనలను జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. వీటిలో ఉత్తమమైన వాటిని రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ శ్రీదేవి, డిప్యూటీ డిఇఒ రామన్నదొర పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకుని తమ విజ్ఞానాన్ని పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విద్యార్థులకు సూచించారు. కొవ్వలి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గ్రంథాలయాన్ని సందర్శించి, అందులోని పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలల్లోని గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

ఉత్సాహంగా.. ఉత్తేజంగా..!

రెండో రోజు కొనసాగిన సిపిఎం 26వ జిల్లా మహాసభ
మూడేళ్ల పోరాటాలు, ఉద్యమ ప్రణాళికపై సమగ్ర చర్చ

సిపిఎం 26వ జిల్లా మహాసభలో భాగంగా రెండో రోజు శనివారం ప్రతినిధుల సభ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. పతాకావిష్కరణతో ప్రారంభమైన ప్రతినిధుల సభలో అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం సిపిఎం రాష్ట్ర నేతలు ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం గత మూడేళ్లలో చేపట్టిన ఆందోళనలు, పోరాటాలతో కూడిన కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టారు. దీనిపై ప్రతినిధులు కూలంకుషంగా చర్చల్లో పాల్గొన్నారు.

సిపిఎం పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ నేత కేతా సూర్యారావు

ప్రజాశక్తి - భీమవరం

రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) నగర్ (ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం)లో వలవల శ్రీరామ్మూర్తి ప్రాంగణంలో సిపిఎం సీనియర్ నేత, చించినాడ పోరాట యోధుడు కేతా సూర్యారావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద మహాసభ ప్రతినిధులు అమరులకు ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మహాసభ కమిటీలను ప్రకటించి వేదికపైకి ఆహ్వానించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, డి.కళ్యాణి, బి.వాసుదేవరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. అనంతరం సంతాప తీర్మానాన్ని కె.రాజా రామ్మోహన్‌రాయ్ ప్రవేశపెట్టారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ఎంఎల్ఎ, జిల్లా ఉద్యమ నిర్మాత ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్), సీనియర్ నేత వలవల శ్రీరామ్మూర్తి మృతికి ప్రతినిధుల సభ సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించింది. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, సీతారాం ఏచూరి చిత్రపటానికి మరో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, ఆర్ఎస్ చిత్రపటానికి జిల్లా కార్యదర్శి బలరాం, శ్రీరామ్మూర్తి చిత్రపటానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి బలరాం కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం మండలాలు, రంగాలవారీగా ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. ప్రతినిధులు కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు.

రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, వి.ఉమామహేశ్వరరావు, జిల్లా నేతలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి
వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే విధంగా పేదలు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు ఏలూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, కంకణాల ఆంజనేయులు, వి.శివ నాగరాణి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ కార్మికులు, పేదల పొట్ట కొడుతోందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి పని దినాలు పెంచి వేతనాలు పెంచాల్సిన జిఒలను నేటికీ విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఒకపక్క ఆర్భాటంగా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తున్నామని ప్రచారం చేస్తున్న మోడీ ప్రభుత్వం మరోపక్క కూలీలకు పని దినాలు తగ్గిపోతుంటే పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఉపాధి హామీ కూలీల నిజ వేతనం రోజు రోజుకూ పడిపోతోందని, దీనివల్ల పేదలకు పనుల్లేక దూర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలసలు పోతున్నారని తెలిపారు. ఈ 12 ఏళ్ల కాలంలో గ్రామీణ ప్రాంతం నుంచి వలసలు పెరిగాయన్నారు. చదువుకున్న యువత నిరుద్యోగులుగా మారి వలసలు పోతున్నారని విమర్శించారు. మోడీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ఏరు దాటక తెప్ప తగలేసినట్లు మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆహార ధాన్యాల కొరత రోజు రోజుకూ పెరుగుతోందన్నారు. వ్యవసాయ కార్మికుడు బతకడమే కష్టదాయకంగా మారిందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన మహిళలు రక్తహీనతతో ఇబ్బందులకు గురవుతున్నా నేటికీ ప్రభుత్వ వైద్యం సరిగ్గా అందకపోవడంతో మహిళలు, గర్భిణులు చనిపోతున్న ఘటనలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రిలయన్స్ అధినేతలకు ఇష్టనుసారంగా పేదల భూములు కట్టబెట్టే ప్రయత్నం మానుకోవాలన్నారు. పేదలకు చెందిన ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, చివరికి స్మశాన భూములను కూడా రిలయన్స్ అధినేతలకే కట్టబెట్టడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో కేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియా రోజురోజుకూ పెరుగుతోందన్నారు. దీనివలన వ్యవసాయ కార్మికుల కుటుంబాలు మద్యానికి బానిసలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకోవడం కోసం పేదలపైన భారాలు మోపుతున్నాయని, విద్యుత్ ఛార్జీలు పెంపు ఒక నిదర్శనం అని తెలిపారు. కాబట్టి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టే విధంగా రాబోయే కాలంలో ఈ రాష్ట్రంలో భూమి, ఉపాధి, కనీస వేతనం, ఇళ్ల స్థలాల కోసం వ్యవసాయ కార్మిక సంఘం పేదల పక్షాన పోరాడుతుందని తెలిపారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ రానున్న సంవత్సరంలో ప్రజావ్యతిరేక విధానాలతో పాటు ఇల్లులేని పేదలకు ఇల్లు, భూమిలేని పేదలకు భూమి కోసం, ఉపాధి హామీ చట్టం సమగ్రంగా అమలు చేయించడం కోసం వ్యవసాయ కార్మిక సంఘం కృషి చేస్తోందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పెద్దన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ ప్రసంగించారు. రాష్ట్ర నాయకులు అప్పలస్వామి, ఎం.జీవరత్నం, మహంకాళి, రాంబాబు, శ్రీనివాసులు తదితరులు నాయకత్వం వహించారు. ఈ క్లాసులకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లాలో శనివారం ప్రారంభించారు. నూజివీడు జూనియర్ కళాశాలలో మంత్రి పార్థసారథి ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.
వార్త 6లో..

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అన్ని తరగతుల ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఆగిరిపల్లిలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల అధికారులు పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో రెవెన్యూ, ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం, వ్యవసాయం, గ్రామీణ నీటి సంఘరా, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించి 223 అర్జీలు వచ్చినట్లు ఎంపిడిఒ బి.భార్గవి తెలిపారు.

అర్హులైన పేద, మధ్య తరగతి ప్రజలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని, గత ప్రభుత్వం నివాసయోగ్యం కాని చోట, ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా లేని చోట ఇచ్చిన నివేశన స్థలాలను మార్చి నివాసయోగ్యమైన చోట అదే లబ్ధిదారులకు మంజూరు చేయాలని, మండలంలో నెలకొన్న పలు సమస్యలు డ్రెయినేజీ, అంతర్గత రోడ్లు, సీసీ రోడ్లు, రేషన్‌కార్డులు, పలు రకాలైన పింఛన్ల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, వడ్లమాను కోరుతూ మంత్రికి వినతిపత్రం అందించారు.

మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కోటేశ్వరరావు

6 నుంచి మెడికల్ పెన్షన్ల రీ-వెరిఫికేషన్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈ నెల ఆరో తేదీ నుంచి చేపట్టే మెడికల్ పెన్షన్ల రీ-వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గుంటూరు జిల్లా నుంచి మూడు బృందాలు వస్తాయని చెప్పారు. ఒక్కో బృందంలో ఒక ఆర్థోపెడిక్ డాక్టర్, ఒక జనరల్ మెడిసన్ స్పెషలిస్ట్‌తో పాటు జిల్లాకు చెందిన వైద్యాధికారితో పాటు ఒక డిజిటల్ అసిస్టెంట్ ఉంటారన్నారు. వీరి తనిఖీలకు వీలుగా షెడ్యూల్‌ను రూపొందించాలని ఆదేశించారు. వీరంతా ఆయా రోగులను, వారి మెడికల్ సర్టిఫికెట్, సదరం, ఆధార్ తదితర ధృవపత్రాలను పరిశీలించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తారన్నారు. జిల్లాలోని 1446 పింఛన్లును వెరిఫికేషన్ టీం ఫించన్‌దారుల ఇళ్లకు వెళ్లి వారి అర్హతను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తున్నట్లు తెలిపారు.

గిరిజనుల సాగు భూములను ఆన్‌లైన్‌లో పెట్టాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గత కొన్ని సంవత్సరాలుగా గిరిజనుల సాగులో ఉన్న భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు కోరారు. మండలంలోని తాటియాకులగూడెం పంచాయతీ రామన్నపాలెంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుకు హాజరై ఇన్‌ఛార్జి డిప్యూటీ తహశీల్దార్ జి.ఉదయ్‌భాస్కర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ రామన్నపాలెం రెవెన్యూ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా గిరిజనుల సాగులో ఉన్న భూములను ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో ఎక్కించలేదన్నారు. ఎస్‌డిసి కోర్టులో గిరిజనులకు అనుకూలంగా తీర్పు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించి అర్హులైన వారికి పట్టలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెల్లం శంకురుడు, తెల్లం జయమ్మ, పండు, నరసింహమూర్తి, ఎస్.కుమారి పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ పతాకజాతా ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో యుటిఎఫ్ 50 ఏళ్ల స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం జిల్లా నుంచి పతాక జాతాను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ మహాసభకు వేలాది మంది ఉపాధ్యాయులు హాజరవుతున్నారన్నారు. జిల్లా నుంచి వందలాది మంది ఉపాధ్యాయులు హాజరవుతున్నారని, ఇప్పటికే ఏలూరుకు నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, ఎన్‌టిఆర్ జిల్లాల పతాకజాతాలు వచ్చాయని తెలిపారు. వాటితో పాటు ఏలూరు జాతా కూడా కలిసి, మధ్యలో రాజమండ్రి జాతాను కలుపుకుని కాకినాడ వెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లా జాతాలో సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, ఎస్.సుధారాణి, కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏలూరులో పతాకజాతా

సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని కొన్నంగుంటలో రూ.కోటితో సుమారు ఐదు కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంత్రి కొలుసు పార్థసారధి శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో పనుల ప్రగతిపై ఆరా తీశారు. గ్రామ ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. కొండపై కురిసిన వర్షంతో రోడ్లు ఎన్నిసార్లు వేసినా పూర్తిగా పాడైపోతున్నాయని ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. శాశ్వత పరిష్కారం కోసం ఆర్‌అండ్‌బి రోడ్డుకు బదులుగా రోడ్డు కమ్ డ్రెయినేజీని నిర్మించాలని ఆర్‌అండ్‌బి, ఎన్ఆర్ఇజిఎస్ అధికారులను ఆదేశించారు.

ప్రజాశక్తి ప్రజల పక్షం

క్యాలెండర్ ఆవిష్కరణలో ఎస్ఐ చంద్రశేఖర్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రజాశక్తి ప్రజల పక్షాన నిలబడి సామాజిక బాధ్యతలను నిర్వహిస్తుందని ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. ప్రజాశక్తి నూతన క్యాలెండర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రజాశక్తి దినపత్రిక వెలుగులోకి తీసుకొస్తుందన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా అనుమతులేకుండా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైటర్ బాబూరావు, శుక్రయోగిన రాంబాబు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

ఆశ్రం ఆసుపత్రికి నాక్ ఎ గుర్తింపు

ప్రజాశక్తి ఏలూరు సిటీ

నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలను, నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన అనంతరం ఎన్ఎసి కౌన్సిల్ వారు ఆశ్రం మెడికల్ కాలేజీకి జాతీయ స్థాయిలో నా ఎ ర్యాంకింగ్‌ను ప్రదానం చేసినట్లు కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్లినికల్ విభాగాలు, స్కిల్ ల్యాబ్, వైద్యులు, సిబ్బంది పరస్పర సహకారంతో, తోడ్పాటుతో మేనేజ్‌మెంట్ నిర్దేశించిన స్థాయిలో నాణ్యమైన వైద్య విద్య అందించగలుగుతున్నామని తెలిపారు. రాజీ పడని నైజమే ఈ విజయానికి కారణమని, ఇందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. కళాశాలకు ఎన్ఎసి వారు ఎ గుర్తింపునివ్వడం మరింత స్ఫూర్తిని కలిగించిందని ఆసుపత్రి సిఇఒ డాక్టర్ హనుమంతరావు తెలిపారు.

సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ఆర్‌టిసి డిపోలో మూడు సూపర్ లగ్జరీ నూతన బస్సులను ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబుతో కలిసి ఆర్‌టిసి బోర్డు (విజయవాడ జోన్) చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. ముందుగా ఏలూరు కొత్త బస్టాండ్ డిపోకు వచ్చిన రెడ్డి అప్పలనాయుడుకు ఎంఎల్ఎ బడేటి చంటికి ఆర్‌టిసి సిబ్బంది, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు, ఆర్‌టిసి అధికారులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ వాణి, అసిస్టెంట్ మేనేజర్ మురళీ పాల్గొన్నారు.

మేకా వెంకటప్రతాప్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా, జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెనికి చెందిన మచ్చా హరిబాబు, చిన్న ఆగిరిపల్లికి చెందిన పల్లగాని నాగేంద్రబాబులు శనివారం నూజివీడులో వైసిపి మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావును ఆయన స్వగృహంలో కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వైసిపి బలోపేతానికి పాటు పడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి మండల జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, అడవినెక్కలం సర్పంచి వేము రాజు, మాజీ ఎంపిటిసి సభ్యులు ఎన్.శ్రీమన్నారాయణ(పండు), నాయకులు జి.హనుమంతరావు, జి.శివ, ఎం.రాజు, సోషల్ మీడియా కో-కన్వీనర్ వి.సక్కేశ్వరరావు పాల్గొన్నారు.

వెంకటప్రతాప్‌ను సత్కరిస్తున్న వైసిపి నేతలు

నేడు మెగా గ్రాండ్ టెస్ట్

ప్రజాశక్తి ఏలూరు సిటీ

ఏలూరులోని ఫైర్‌స్టేషన్ వద్ద ఉన్న త్రివేణి ప్రసాద్ స్టడీ సర్కిల్‌లో కానిస్టేబుల్ మెయిన్స్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు ఈ నెల ఐదో తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఉచిత మెగా గ్రాండ్ టెస్ట్ 200 మార్కులకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరు కావాలంటే ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 9347657730, 9182689695 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అగ్ని ప్రమాదంలో షాపు దగ్ధమైన ఘటన కొయ్యలగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొయ్యలగూడెం గ్రామానికి చెందిన మదేటి లక్ష్మి అదే గ్రామంలో అద్దెకు షాపు తీసుకుని క్లాత్ స్టోర్స్ నిర్వహిస్తుంది. ఆమె భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. ఆ షాపులో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు లక్ష్మికి సమాచారం అందించారు. ఆమె స్థానికులతో కలిసి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. షట్టర్ లాక్ కావడంతో మంటలు అదుపు చేయడం కష్టమైంది. షట్టర్‌ను తెరిచేసరికి లోపల ఉన్న వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.నాలుగు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు, మానవత సంఘం అధ్యక్షులు మాటూరు సుధీర్ రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించారు. ఆర్యవైశ్య సంఘం కూడా తమ వంతుగా సహాయం అందిస్తామని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి ఏలూరు సిటీ

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. ఏలూరు పవర్‌పేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద మేదరి వీధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పవర్‌పేట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గౌతమ్, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, సూపర్‌వైజర్ ఝాన్సీ, అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా వాలంటీర్లకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వయోజన విద్య ఉల్లాస్ అక్షరాస్యత ద్వారా శిక్షణ పొందిన డ్వాక్రా వాలంటీర్లు నిరక్షరాశ్యులను అక్షరాశ్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కెవివి.సత్యనారాయణ అన్నారు. ఏలూరు మండల డ్వాక్రా భవనంలో శనివారం వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఎంపిడిఒ శ్రీలత చేతులమీదుగా శిక్షణ పొందిన డ్వాక్రా వాలంటీర్లకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎపిఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని డ్వాక్రా గ్రూపు మహిళల్లో మొదటి విడతగా 310 మంది నిరక్షరాస్యులను గుర్తించి వీరందరినీ అక్షరాస్యులుగా చేసేందుకు 31 వాలంటీర్లు నియమించినట్లు తెలిపారు.

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి -ముదినేపల్లి

రెవెన్యూ శాఖకు చెందిన భూ సమస్యల శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తహాశీల్దార్ జెఎస్.సుభాని అన్నారు. మండలంలోని సంకర్షణపురం, కొరగుంటపాలెం గ్రామాల్లో శనివారం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో సంకర్షణపురంలో రెండు, కొరగుంటపాలెంలో పది అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీ సభ్యులు మరింత కృషి చేయాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.పిచ్చోడు కోరారు. అయ్యవారి రుద్రవరంలోని ప్రాథమిక పాఠశాలలో యాజమాన్య కమిటీ సభ్యులకు శనివారం ఆయన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జయశ్రీ పాఠశాల ఛైర్మన్ వి.విజయశాంతి, వైస్ ఛైర్మన్ కె.శ్రీధర్, అంగన్వాడీ కార్యకర్త సిహెచ్.వాణి, మహిళా పోలీస్ ఎం.సత్యవతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కళాశాలల్లో డొక్కా సీతమ్మ భోజన పథకం ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం అమలుగా ఈ ఏడాది రూ.27.39 కోట్లు, వచ్చే విద్యా సంవత్సరంలో రూ.85.84 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయనుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నూజివీడు ముడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మంత్రి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 19 జూనియర్ కళాశాలల్లో 3,734 మంది విద్యార్థులు ఉన్నారని, వారిలో నూజివీడు జూనియర్ కళాశాలలో 410 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వీరందరకి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ బి.ప్రభాకరరావు, కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జెడ్‌పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటితో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రారంభించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యే ప్రథమ ప్రాధాన్యతగా చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ వెంకట లక్ష్మమ్మ, ఆర్‌టిసి విజయవాడ రీజినల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.రాజ్‌కృష, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గుత్తా గిరిబాబు పాల్గొన్నారు.

చింతలపూడి :గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని, టిడిపి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యారంగంలో విశేష సంస్కరణలు తీసుకొస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు డిఎస్‌సి కోచింగ్ పుస్తకాలను అందించారు.

ఆగిరిపల్లి : ఎంవిఎన్, వైవిఎన్. పభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపల్ కె.యోహాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్, జెడ్‌పిహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత, గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబు, టిడిపి గ్రామ అధ్యక్షులు పి.నరసింహారావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక డిగ్రీ జూనియర్ కాలేజీలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమంలో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పోలవరం : పోలవరం ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో ఎపి ట్రైకార్ బొరగం శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ స్టేట్ ర్యాంకులు సాధించిన ఘనత పోలవరం కళాశాలకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, సర్పంచి పొడుం పుష్ప, జనసేన సీనియర్ నాయకులు, కొణతాల ప్రసాద్, బొడ్డు కృష్ణ, తెలగంశెట్టి రాము, నునకాని రాంబాబు, పోతుల శ్రీను, లెక్చరర్లు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు ప్రారంభించారు. సర్పంచి సానా మీనా సరస్వతి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, మాజీ జెడ్‌పిటిసి నున్నా రమాదేవి, నాయకులు ముద్దం బోగేశ్వరరావు, పి.వెంకటసత్యనారాయణ, చిట్టూరి రవీంద్ర, ప్రిన్సిపల్ త్రినాధ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : నారాయణపురంలో మహాత్మాగాంధీ ప్రభుత్వ కళాశాలలో ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ తమ కాలేజీలో 193 మంది విద్యార్థులకు స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో భోజనాలు వండి తీసుకొచ్చి కళాశాల విద్యార్థులకు భోజనాలు అందిస్తున్నామన్నారు. సర్పంచి దిడ్ల అలకనంద పాల్గొన్నారు.

ముదినేపల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా మధ్యాహ్న భోజన పథకాన్ని టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కో కన్వీనర్ కొడాలి వినోద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, శ్రీహరిపురం సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, ముదినేపల్లి డిసి వైస్ ఛైర్మన్ హనుమార పేర్నిడు, కమలాపురం డిసి వైస్ ఛైర్మన్ పోసిన పాండురంగారావు పాల్గొన్నారు.

మండవల్లి : జూనియర్ కళాశాలలో ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఇఒలు రామారావు, రత్నసునాదాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బేతపూడి రవితేజ, జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసాద్, గన్నవరం ఇక్కడికిగూడెం నీటి సంఘం అధ్యక్షులు కోనప రెడ్డి కోటేశ్వరరావు, ఎన్‌కె.రాంబాబు, నాయకులు ముళ్లపూడి సత్తిబాబు, యార్లగడ్డ శంకర్, గుడివాడ గణేష్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :విద్యార్థులకు పోషక విలువలతో కూడిన భోజనం పెట్టడమే టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ సేవలను గుర్తించి ఆమె పేరు మీద మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిర్రి జగదాంబ, ఎంఇఒ కె.శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ సతీష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు పడమర వీధి గంగానమ్మ మున్సిపల్ హై స్కూల్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్న ప్రీ స్కూల్ ఆక్టివిటీస్‌ను కలెక్టర్ పరిశీలించారు. పిల్లలతో ఇంగ్లీష్‌లో పలు ప్రశ్నలు వేశారు. వాటికి ఆ చిన్న పిల్లలు చెప్పిన సమాధానాలకు కలెక్టర్ ముగ్ధులయ్యారు. పిల్లలకు చక్కని శిక్షణ అందిస్తున్న అంగన్వాడీ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు, పిల్లలకు ప్రీ ప్రైమరీ స్కూల్ ఆక్టివిటీస్ కూడా పూర్తిగా నేర్పాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు తప్పనిసరిగా నిర్దేశించిన సమయాలను పాటించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు.

నూజివీడు ఆర్‌జియుకెటిలో టెక్ హ్యాకథాన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి పరిధిలోని నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు, ఇడుపులపాయల్లో ఫేస్-1 టెక్ హ్యాకథాన్‌ను నిర్వహించారు. ఫేస్-1లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారు ఫేస్-2కు ఎంపికయ్యారు. ఫేస్-2ను నూజివీడులో శుక్ర, శనివారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ ఎం.విజయ్‌కుమార్, డైరెక్టర్, రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులను అభినందించారు. బహుమతులను ప్రదానం చేశారు.

తోటపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

హెచ్ఐవి అనేది సురక్షం కాదని, లైంగిక సంబంధాల ద్వారానే ఎక్కువ శాతం సంక్రమిస్తుందని, ఇది అంటువ్యాధి కాదని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ సుందరరావు అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు పలు రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సగ్గూరు పిహెచ్‌సి వైద్యాధికారి సంధ్యాప్రియ, ఎంఎల్‌హెచ్‌పి జోషి, ఎఎన్ఎం సునీత, లింక్ వర్కర్లు సదాలక్ష్మి, రాఘవేంద్రబాబు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సిఆర్ రెడ్డిలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక సర్ సిఆర్ రెడ్డి కళాశాల ప్రాంగణంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఐక్యూ ఎని విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు-2025 ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఆర్ రెడ్డి విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వివి.బాలకృష్ణారావు భోగి మంటలతో సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ చిట్టూరి జానికిరామయ్య, కళాశాల కరస్పాడెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమెహన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు, మేనేజింగ్ కమిటీ సభ్యులు బొప్పన ప్రసాద్, కె.హరిరామ కృష్ణంరాజు, కల్కి సత్యనారాయణ, గుత్తా కాశీ విశ్వనాథరావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ముదినేపల్లి:వ్యాపారులు, ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ వీఎస్.వీరభద్రుడు అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో సీసీ కెమెరాలు ఉపయోగం గురించి వ్యాపారులకు, గ్రామస్తులకు అవగాహనా సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో చోరీల నివారణకు ప్రజలు, వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంట రాకేష్‌కుమార్, వ్యాపారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్చి 31 లోపు ఇళ్లు నిర్మించుకోవాలి

ఉంగుటూరు :హౌసింగ్ లబ్ధిదారులు మార్చి 31లోపు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, లేకపోతే వారికి మంజూరు అయిన రుణాలను రద్దు చేస్తామని ఎంపిడిఒ జిఆర్.మనోజ్ తెలిపారు. ఉంగుటూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గృహ నిర్మాణ లబ్ధిదారుల అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున రూ.1.80 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు.డ్వాక్రా నుంచి మొబలైజేషన్ గ్రాంట్ కింద రూ.35 వేల లోను ముందుగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

యాసిడ్ దాడి కేసులో జీవిత ఖైదు శిక్ష రద్దు

తిరిగి విచారణ జరపాలని కింది కోర్టుకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి

ఏలూరుకు చెందిన వివాహితపై 2023 జూన్ 13న యాసిడ్ దాడి ఘటనలో కింది కోర్టు విధించిన యావజ్జీవ శిక్షను హైకోర్టు రద్దు చేసింది. హుడావుడిగా విచారణ చేయడాన్ని తప్పుపట్టింది. కింది కోర్టు తిరిగి విచారణ చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. యాసిడ్ దాడితో వివాహిత మరణించింది. ఈ కేసును ఏలూరు ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు 8వ అదనపు జిల్లా కోర్టు విచారించింది. బి నాగ సతీష్ సహా నలుగురికి జీవిత ఖైదు శిక్ష విధించింది. ఆ తీర్పును ఆ నలుగురు హైకోర్టులో సవాల్ చేశారు. తమకు న్యాయవాదులు లేనప్పుడు, లీగల్ ఎయిడ్ ద్వారా న్యాయవాదిని నియమించేందుకు కింది కోర్టు చర్యలు తీసుకోలేదన్న వారి వాదనను హైకోర్టు ఆమోదించింది. కింది కోర్టు హడావుడిగా కేసు విచారణ పూర్తి చేసి తీర్పు చెప్పిందని ఆక్షేపించింది. తమ వాదనలు చెప్పుకునేందుకు చట్టపరమైన తగిన గడువు ఇవ్వాలని చెప్పింది. ఈ కేసును తిరిగి అదే కోర్టుకు తిప్పి పంపింది. తాజాగా విచారణ పూర్తి చేసి తిరిగి తీర్పు వెలువరించాలని కింది కోర్టును ఆదేశించింది. నిందితులకు సముచిత అవకాశం కల్పించాలని, తిరిగి విచారణ చేపట్టి ఆరు నెలల్లో ఆ ప్రక్రియను పూర్తి చేయాలని ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టును ఆదేశించింది. నిందితుల బెయిల్ పిటిషన్లను విచారించాలంది. ఈ మేరకు జస్టిస్ కె సురేష్ రెడ్డి, జస్టిస్ కె శ్రీనివాసరెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది.

రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి -పోలవరం

రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్ బాషా సూచించారు. మండల కేంద్రంలో స్థానిక గౌతమి అతిథి గృహంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పోలవరం నియోజకవర్గ ఏడు మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్ బాషా మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు తోడ్పడాలని సూచించారు. రైతు శిక్షణా కేంద్రం ట్రైనింగ్ ఎడిఎ పి.లలిత, సుధారాణి, క్రాప్ లైఫ్ సిస్టం యాప్ గురించి అవగాహన కల్పించారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

స్పర్శతో అక్షరాలను గుర్తించే విధానాన్ని కనిపెట్టి అంధులు కూడా సకల విద్యలను అభ్యసించేందుకు దారి చూపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని హీల్ స్కూల్ ఫణీంద్ర చుండూరి ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజువల్లీ చాలెంజ్డ్(అంధ పాఠశాల) చీఫ్ ఇన్‌స్ట్రెక్టర్ సుఖవాసి రుష్మంత్ అన్నారు. అంధుల బంధువు డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ వేడుకలను హీల్ స్కూల్‌లో అంధ విద్యార్థుల సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు. .

చింతలపూడి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ సతీమణి విజయరోషన్ అన్నారు. మండలంలోని సుబ్బరాజు జిల్లా పరిషత్ పాఠశాలలో బ్రెయిలీ పుట్టినరోజు సందర్భంగా వికలాంగుల మధ్య విజయరోషన్‌కుమార్ కేక్ కట్ చేశారు. వికలాంగ పిల్లలకు బహుమతులు అందించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన విజయకేతనం స్టడీ మెటీరియల్ ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు.

టి.నరసాపురం:అంధులు రాయడానికి, చదవడానికి లిపి కనుగొన్న లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయుడని ఎంఇఒ టి.రామ్మూర్తి అన్నారు. స్థానిక భవిత కేంద్రం పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జన్మ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేకు కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు.

మండవల్లి : అంధులకు లూయిస్ బ్రెయిన్ లిపి ఎంతగానో దోహదపడుతుందని ఎంఇఒలు రామారావు, రత్నసనాదాలు అన్నారు. మండలంలోని లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భవిత కేంద్ర ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు రెండో రోజు దేహదారుఢ్య పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి చేశామని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. కొన్ని రోజులుగా కానిస్టేబుల్ అభ్యర్థుల ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు ఏలూరు రేంజ్ పరిధిలో నగరంలోని జిల్లా పోలీస్ మైదానంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ సారథ్యంలో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల మూడు, నాలుగు తేదీల్లో మహిళ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించారు. ఈ రెండు రోజులు ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఫిజికల్ టెస్టులు ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రెండో రోజు 489 మంది మహిళ అభ్యర్థులకు హాల్ టికెట్లు మంజూరు చేయగా అందులో 277 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. వారిలో 117 మంది మాత్రమే అర్హత సాధించారన్నారు. మళ్లీ ఈ నెల తొమ్మిదో తేదీ వరకు జరిగే ఈ ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టుల్లో పురుష అభ్యర్థులకు కొనసాగుతాయని తెలిపారు.

లోబ్రిడ్జి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

లోబ్రిడ్జి సమస్య శాశ్వత పరిష్కారానికి పటిష్ట చర్యలు చేపట్టామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. అవసరమైతే ఈ సమస్యను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాలను కలుపుతూ అనుసంధానంగా నిర్మించిన రైల్ కమ్ అండర్ బ్రిడ్జిలో నిత్యం గ్రౌండ్ వాటర్ నీరు ఊరుతూ, ఇసుక పైకి రావడంతో బ్రిడ్జి అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతోపాటు ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే పలువురు వాహనదారులు ఇక్కడ నీటి ప్రవాహం వల్ల ఏర్పడిన నాచు కారణంగా జారిపడి ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. ఈ బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించేందుకు ఎంఎల్ఎ బడేటి చంటి ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో శనివారం వరంగల్ నిట్‌కు చెందిన నిపుణుల బృందం సభ్యులు ప్రొఫెసర్ రమణరావు, ప్రొఫెసర్ పాండురంగారావు, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబులతో కలిసి ఈ ప్రాంతాన్ని ఎంఎల్ఎ బడేటి చంటి మరోసారి సమగ్రంగా పరిశీలించారు. పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరిపిన నిపుణులు శాంపిల్స్‌ను పరిశీలించిన అనంతరం పరిష్కారమార్గాలను సూచించారు. నిపుణుల బృందం సభ్యులు ప్రొఫెసర్ రమణరావు, పాండు రంగారావు మాట్లాడుతూ ఊరుతూ వచ్చేది నార్మల్ గ్రౌండ్ వాటరేనని వారు ప్రాథమికంగా వెల్లడించారు. 75 శాతానికి మించి తొలుత పరిష్కారానికి చర్యలు చేపడతామని, తర్వాతే పూర్తిస్థాయి చర్యలకు సాధ్యమవుతుందన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ఎంఎల్ఎ బడేటి చంటి సారథ్యంలో త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుందన్నారు.

పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ

చింతలపూడి :పారా లీగల్ వాలంటీర్లు మండల న్యాయ సేవా కమిటీ, సామాన్య ప్రజలకు మధ్య వారధి వంటి వారని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థలో పారా లీగల్ వాలంటీర్లుగా ఉచిత సేవలందించేందుకు దరఖాస్తు చేసుకున్న పారా లీగల్ వాలంటీర్లకు శనివారం సంస్థ ఛైర్మన్ సిహెచ్.మధుబాబు అధ్యక్షతన ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని న్యాయ సహాయం అందించాలన్నారు. వారి వారి ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేయడంలో సహకరించి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నించాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.నాగేశ్వరరావు పలు చట్టాలపై వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్స్ ఫణిదీప్, ఏసుపాదం కోర్టు సూపరింటెండెంట్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం, కెరియర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామీణ ప్రాంత విద్యార్థులు సరైన లక్ష్యాన్ని నిర్ణయించుకోకుండా చదువులు కొనసాగించడం వల్ల పెద్దగా ప్రయోజనాలు పొందలేకపోతున్నారని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదాదేవి అభిప్రాయపడ్డారు. భీమడోలు శ్రీ వెంకటేశ్వర కళాశాలలో శనివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరియర్ గైడెన్స్ అంశాలపై సెట్‌వెల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా యువజన సర్వీసుల శాఖ కమిషనర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెట్‌వెల్ సిఇఒ ప్రభాకర్, మేనేజర్ సత్యనారాయణ, పర్యవేక్షకులు జాన్ కెనడీతో పాటు కళాశాలకు చెందిన భవాని సింగ్, ఎన్‌సిసి కెప్టెన్ కె.శివశంకర్ పాల్గొన్నారు.

పేరు మార్పు

యిబ్బా జెసురాణి, భర్త కర్నాటి వెంకట శ్రీను, స్త్రీ, డోర్‌నెం.14-8-8, దొరల వీధి, 25వ వార్డు, యాగర్లపల్లి, తాడేపల్లిగూడెం, పిన్‌నెం.534102, పశ్చిమ గోదావరి జిల్లా. అను నేను తెలియజేయునది నా అసలు పేరు యిబ్బా జెసురాణి కాని నా భర్త సర్టిఫికెట్స్ నందు రాణి కర్నాటి అని పడినది, కాని వాస్తవంగా నా అసలు పేరు యిబ్బా జెసురాణి అని ఇందుమూలముగా తెలియజేయటమైనది.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, ఆచంట గ్రామానికి చెంది అద్దాల శ్రీనివాస్, తండ్రి : గంగారావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. ఇంటి దగ్గర నుండి నెట్ సెంటర్ కు వెళ్తుండగా నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : U0385007 గల పాస్‌పోర్టు పడిపోయినది, ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

అద్దాల శ్రీనివాసు, తండ్రి : గంగారావు
డోర్ నెం : 3-98, ఆచంట, ఆచంట మండలం
ప.గో.జిల్లా. సెల్ : 9550922169

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం చిట్టవరం గ్రామానికి చెంది ఉచ్చుల సుధారాణి C/o.సురేష్ కుమార్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. ఇంటి నుండి జిరాక్స్ సెంటర్ కు వెళ్తుండగా నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : L5191047 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్ : **ఉచ్చుల సుధారాణి**, C/o.సురేష్ కుమార్
డోర్ నెం : 3-182, చిట్టవరం
నరసాపురం మండలం, ప.గో.జిల్లా.
సెల్ : 7702381288

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, రమణక్కపేట గ్రామ కాపురస్తుడు చిట్లూరి సత్యనారాయణ గారి కుమారుడు భాస్కరరావు యిచ్చిన సంజాయిషీ ప్రకారము నా క్లయింట్ పూర్వం కృష్ణాజిల్లా, ప్రస్తుతం యన్.టి.ఆర్.జిల్లా, విస్సన్నపేట సబ్-రిజిస్ట్రారు వారి యిలాకా చాట్రాయి మండలం, సోమవరం గ్రామ పంచాయితీ పరిధిలోని రీ.సర్వే నెం.347/2లో య.0.95 సెంట్ల వ్యవసాయ భూమిని ది.14.09.2010వ తేదీన సోమవరం గ్రామ కాపురస్తులు శ్రీమతి కొండూరి గిరిజా కుమారి నుండి కొనుగోలు చేసి విస్సన్నపేట సబ్-రిజిస్ట్రారు వారి యిలాకా డాక్యుమెంట్ నెం.4096/2010 గా విక్రయ దస్తావేజు రిజిష్టరు కాబడి తదాది నా సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో అనుభవించుచున్నాడు. ఇట్టి క్రమములో నా క్లయింట్ ది.01.01.2025వ తేది ఉదయం గం॥9.00ల సమయములో పై తెలిపిన డాక్యుమెంట్ నెం.4096/2010 గల ఒరిజినల్ దస్తావేజును నూజివీడు పట్టణములోని మైలవరం రోడ్డులోని జిరాక్స్ షాపు వద్దకు వెళ్లగా సదరు ఒరిజినల్ దస్తావేజు జిరాక్స్ షాపు వద్ద జారి పడిపోయినది. దానిపై నా క్లయింట్ చుట్టుప్రక్కల ప్రదేశాలు వెదికినప్పటికీ ఒరిజినల్ దస్తావేజు కనిపించలేదు. కావున పై తెలిపిన దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నాకు గాని, నా క్లయింట్‌కు గానీ అందజేయగలరు.

నక్కనబోయిన మురళీకృష్ణ
నల్లిబోయిన వంశీ
నూజివీడు న్యాయవాదులు, నూజివీడు.
తేది.04.01.2025 సెల్: 8008298419.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

ఇ.పి.నెం.9/2024 ఇన్ ఓ.ఎస్.నెం.212/2022

బిట్వీన్:
రెడ్డి సత్యనారాయణ
...డి. హెచ్.ఆర్ /ప్లెయింటిఫ్
మద్దుకూరి నాగేశ్వరరావు
...జె.డి.ఆర్ /డిఫెండెంట్

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్థి వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది /జె.డి.ఆర్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి **ది. 20-01-2025 వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టులో వేలం వేయబడును.** షరతులు తెలుసుకొని పాడుకొనవలెను.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జగన్నాదపురం గ్రామం తాలూకు వ్యవసాయ భూమి bearing R.S.No.115 to an extent of Ac.0-60 Cents of Agriculture land bounded by:
East: Talla Venkateswarao's Land.
South: Maddhukuri Ramarao's Land.
West: Land of Siddhina Sirisha.
North: Siddhina Venkataswararao's Land. & Etc., Land.

పై హద్దుల మధ్య య.0-60 సెంట్లు గల వ్యవసాయ భూమి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.
వాది /డి.హెచ్.ఆర్ వాల్యూ /కిమ్మత్తు : రూ.10,00,000/-
అమీనా వాల్యూ /కిమ్మత్తు : రూ.20,00,000/-

MUTYALA SUNIL KUMAR
Advocate for D.H.R.
Tadepalligude.